# సర్వం బ్రహ్మమయం జగత్

కట్టెలందున నిప్పులు కలుగునట్లు
తిలల యందున తైలంబు వెలయు పగిది
ఎందు జూచిన దైవంబె ఇమిడియుండు
విశ్వసించుడు దీని విద్యార్థులార!

**విద్యార్థులారా!**

సర్వం బ్రహ్మమయం జగత్. భగవంతునితో సంబంధము లేని పదార్థము జగత్తులో కానరాదు. జగత్తంతయు బ్రహ్మస్వరూపమే. అయితే ఇట్టి సర్వత్వాన్ని గుర్తించుకునే శక్తులు అందరియందు లేవు. ప్రతి కట్టెయందు అగ్ని ఉన్నది. అట్లని ఒకలారీ కట్టెలు తెచ్చి ఒక పాత్రలో నీరు బియ్యము పోసి ఆ కట్టెలపైన పెట్టినప్పుడు అది అన్నమగునా? అగ్నికి అంతర్బహిర్గతములనే స్థితులు రెండుంటున్నవి. అంతరగ్ని బహిరగ్ని. కంటికి కనుపించక లోపల వెలుగుతున్న అగ్ని అంతరగ్ని. అట్టి అగ్ని ఉండియు దేనిని కాల్చలేదు. అయితే బహిర్గతమైన అగ్ని ఒక స్వరూపాన్ని ధరించి సర్వమును భస్మము గావించుతుంది. అదేవిధముగానే భగవంతుడు సర్వత్రా ఉండినప్పటికిని దాన్ని సాక్షాత్కరింపజేసుకొనే శక్తి సామర్థ్యములు ఒక్కొక్కరికి బహిర్ముఖముగా ఒక్కొక్కరికి అంతర్ముఖముగా ఉంటుంటాయి. జగత్తునందలి ప్రతి పదార్థము జడ చైతన్యములన్నీ కూడను భగవంతుని గర్భమునందే ఉంటున్నవి. తృణము మొదలుకొని పర్వతము వరకు, బిందువు మొదలుకొని సింధువు వరకు, పరమాణువు మొదలుకొని పరబ్రహ్మము వరకు వ్యాపించిన తత్త్వం ఒక్కటే. ఏకత్వముతో కూడిన ఇట్టి దివ్యత్వాన్ని అందరు సాక్షాత్కరింప జేసుకోలేరు.

జగత్తంతా నారాయణమనే చెప్పవచ్చు. భక్తుని భావములు, భగవంతుని ప్రేమకిరణములు

srisathyasaivachanamrutam

రెండు కూడినప్పుడే ఇది సాక్షాత్కారమౌతుంది. భగవంతుడు కలదు కలదు అనే ఆస్తికునియందు ఈ ఆధ్యాత్మిక అగ్ని ప్రజ్వరిల్లుతూనే ఉన్నది. కలదన్న వాని హృదయమునందు ప్రేమ భావములు ప్రకటితములౌతూ ఉంటాయి. లేదన్న వాని హృదయమునందుకూడను ప్రేమభావములు ప్రకటితమౌతూ ఉంటాయి. అయితే ఆస్తికునియొక్క ప్రేమభావములు పరమాత్మపైన ప్రసరిస్తూ ఉంటాయి. నాస్తికుని ప్రేమభావములు ప్రకృతిపైన ప్రసరిస్తూ ఉంటాయి. ప్రాకృత విషయములందు తన ప్రేమతత్వాన్ని ఇమిడ్చినప్పుడు బంధనకు కారణమౌతున్నాడు. తన ప్రేమతత్త్వమును పరతత్వముపైన ప్రసరింపజేసినప్పుడు ఇతనే ముక్తుడౌతున్నాడు. బంధమోక్షములకు ప్రేమతత్త్వం ఒక్కటే. ఆ ప్రేమనే దైవస్వరూపం. ప్రేమను ప్రేమతో తప్ప అన్యమార్గమునందు అనుభవించుటకు వీలుకాదు. ఇట్టి ప్రేమను ప్రేమతో కూర్చినదే భాగవతము.

అయితే కొంత సందేహం కలుగవచ్చు. ఈ భాగవతమునందు ప్రేమతత్త్వము కలిగిన ఆస్తికులు మాత్రమే కాకుండా దివ్యత్వాన్ని విరోధ పరచుకున్న నాస్తికులు కూడను ఉంటున్నారే! హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, కంస, దంతవక్త్ర, శిశుపాల ఇత్యాది దుర్మార్గులుకూడను భాగవతంలో ఉంటుండటంచేత కేవలం భక్తులకు భగవంతునికి మాత్రమే సంబంధ బాంధవ్యమని చెప్పుటలో యేమాత్రం అర్థం లేదు కదా! దీనికొక చక్కని ఆదర్శము. ఎవరైనా మన ఇంటికొచ్చి దాహంచేత నీరు అడిగినప్పుడు, నీరో, లేక మజ్జిగో, లేక జ్యూసో ఏదో ఒకటి మనం అందించాలి. అది అందించటానికి ఒక పాత్ర కావాలి. ఈ పాత్ర వెండిపాత్ర కావచ్చు లేక పింగాణి పాత్ర కావచ్చు లేక ప్లాస్టిక్ పాత్రకావచ్చు. పాత్ర ప్రధానము కాదు. పదార్థము ప్రధానము.

అదేవిధముగనే ఈ హిరణ్య కశిపుడు హిరణ్యాక్షుడు, కంసుడు శిశుపాలుడు, దంతవక్త్రుడు వీరందరుకూడను ఒక్కొక్క పాత్రగా ఇందులో నిరూపించారు. ఈ పాత్ర యందుండిన పదార్థతత్త్వాన్ని పరార్థంగా మార్చి యదార్థమైన స్వరూపాన్ని నిరూపించటమే. దీనివల్ల చెడ్డకూడను భాగవతమునందు చెప్పటానికి అవకాశము ఉంటుందాది. నీదృష్టియందు వారు రాక్షసులు కావచ్చును. దైవదృష్టియందు వారు భక్తులకు సహాయకారులుగా నిలచవచ్చును. ఇట్టి రాక్షసులను

ఆదర్శముగా తీసుకొనియే ఆత్మతత్త్వాన్ని భక్తుల కందిస్తూ వచ్చాడు భగవంతుడు. Pleasure is an interval betwen two pains. రెండు చెడ్డలమధ్యనే ఒక మంచి ఇమిడి ఉంటుంటాది. నిజముగా ఈ హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపులే లేకపోతే ప్రహ్లాదునికి నరసింహావతారము సాక్షాత్కరించటానికి అవకాశమే లేదు. అదే విధముగనే విరోధతత్త్వమే లేకపోతే విశ్వాసము బలపడటానికి వీలే ఉండదు. పరమభక్తుడైన ప్రహ్లాదుని తండ్రియైన హిరణ్యకశిపుడు అనేక విధములుగా హింసించినప్పటికిని కట్టకడపటికి అతని భక్తి ప్రపత్తులు జగద్వ్యాప్తి గావటానికి ఈ కష్టములే కారణము. హిరణ్యకశిపుడే కారణము. పరమభక్తుని పరమశాంతి సుఖములనందించే నిమిత్తమై ఈ విధమైన విరోధ తత్త్వములను, వ్యక్తులలో సృష్టించి తద్వారా వారియొక్క ఆస్తికత్వాన్ని బలపరుస్తూ వచ్చాడు భగవంతుడు. కట్టెకు కట్టె రాపిడి జరిగినప్పుడు అగ్ని సాక్షాత్కరిస్తుంది. ఇందులో అగ్ని అంతర్ముఖంగా ఉండినప్పటికిని ఇది సాక్షాత్కరించాలంటే కట్టె కట్టె రాపిడి జరగాలి. అయితే నేడు కొంచెము, రేపు కొంచెము ఈ విధంగా రాపిడి జరిగినప్పుడు కట్టెముక్కలై పోతుందేగాని అగ్ని ఆవిర్భవించదు. నిరంతరము భగవన్నామము చేతనే మానవత్వమునందున్న జ్ఞానాగ్ని ప్రజ్వలిస్తుంది. భక్తులకు ఆనందమును సుఖమును అనుభూతి అందించే నిమిత్తమై ఇలాంటి దుష్టులు పక్కలో ఉండి తీరాలి. బిడ్డను పెంచి నవ్విస్తూ, ఆడిస్తూ ఆనందాన్ని అందించాలంటే తల్లికి పక్కలో బిస్కట్లు, పిప్పరమెంట్లు, ఆట వస్తువులు అన్నీ పెట్టాలక్కడ. ఈ ఆటవస్తువులు ఎందుకోసం పెట్టాలి? బిడ్డలయొక్క ఆనందము నిమిత్తమై ఈ వస్తువులు పెట్టాలి. తల్లికి ఆ వస్తువులతో ఏమీ ప్రయోజనం లేదు. బిడ్డ ఏడిస్తే తల్లి సహించలేదు. బిడ్డను ఆనందపరచే నిమిత్తమై తల్లికి అవసరము కాని వస్తువులైనను బిడ్డలకందించి ఆ బిడ్డను ఆనందపరుస్తుంది. అదే విధముగనే భక్తుని ఆనందపరచాలనుకున్నప్పుడు అతనిలో ఉద్భవించిన దివ్యత్వాన్ని ప్రకటింపజేయదలచినప్పుడు అతనికి ఈ జగత్తు రూపమైన విరోధమైన పనికిమాలినవైనను అతని చెట్టూ పెట్టి తద్వారా దీనిని బయటకు లాగాలి.

ఒక చిన్న ఉదాహరణము. చెరకులో పిప్పి లేకపోతే రసము నిలువలేదు. మనము తీసుకోవలసినది రసము. వదలవలసింది పిప్పి. ఈ రసము పిప్పితో కూడిఉంటుంది. ఈ పిప్పి మనకక్కరలేదు. కానీ ఈ పిప్పి ద్వారానే ఈ రసము పొందాలి. అదేవిధముగనే విరుద్ధమైన

sri sathyasai vachanamrutam

మార్గముల ద్వారానే యదార్థమైన దివ్యత్వాన్ని మనం అందుకోవటానికి ప్రయత్నించాలి. ఏ చిన్న విషయమునందు కూడను కొన్ని రకములైన విరుద్ధములైన మార్గములనుసరించినప్పుడే యదార్థమైన తత్త్వము మనకర్థమవుతుంది. శరీరమునకు కసరత్తు చేయాలనుకున్నప్పుడు ఈ శరీరమునకు మంచి పుష్టి, సంతుష్టి కలగాలంటే అనేక విధములుగా శ్రమ పెట్టాలి.

**పిలిచి అడుగ చెరకు పెట్టునా బెల్లంబు**
**పిప్పిగొట్టి రసము పీల్చుకున్న**

జాతి వజ్రమైన సానబెట్టవలె. సానపెట్టకపోతే డైమండ్‌కు విలువరాదు. కనుకనే దివ్యత్వమనేది సర్వులయందు ఉండినప్పటికిని ఒక్కొక్క వ్యక్తియందు బహిర్ముఖముగా గోచరిస్తుంది. బహిర్ముఖముగా గోచరించటానికి కారణవేమిటి? భక్తునియందున్న భావము భగవంతునియందున్న ప్రేమ రెండింటియొక్క సమ్మిళితమైన సంబంధమే ఈ వ్యక్తిత్వం గావటానికి కారణం.

**సర్వం విష్ణుమయం**

ప్రహ్లాదునకు నరసింహుడు ప్రత్యక్షం కావటానికి ఎవరు కారణం? ప్రహ్లాదుడా? లేక హిరణ్యకశిపుడా? ఇరువురు కారణమే. హిరణ్యకశిపునియందున్న ప్రహ్లాదునియందున్న విశ్వాసమునకు అక్కడ రెండింటికిని సాన జరిగింది. దేవుడు ఎక్కడ ఉన్నాడు అని హిరణ్యకశిపుడు ప్రశ్నించాడు. 'ఇందుగలడందు లేడని సందేహము వలదు' అని ప్రహ్లాదుడు జవాబు చెప్పాడు. అయితే ఈ స్తంభము నందున్నాడా? ఉన్నాడని చెప్పాడు ప్రహ్లాదుడు. అప్పుడు స్తంభాన్ని కొట్టాడు. అప్పుడే నరసింహుడు ప్రత్యక్షమయ్యాడు. కనుక ఈ ఇరువురియొక్క సన్నిహిత సంబంధ బాంధవ్యములైన భేదములే దీనికి మూలకారణములైనవి. అతనియందు ఆరూపములో, ఇతనియందు ఈ రూపములో ఉంటున్నాడు భగవంతుడు. అనేది తానే అనిపించుకొనేది తానే. వర్ణించేది తానే దూషించేదీ తానే. అందుకొనేదీ తానే. అందించేదీ తానే. కనుక ఈ ఏకత్వమనే తత్త్వాన్ని అర్థం చేసుకున్నప్పుడే సర్వం విష్ణుమయం జగత్తన్నది మనకర్థమవుతుంది.

జాగ్రత్ స్వప్న సుషుప్తులయందు మనం ఒక్కటిగానే ఉంటున్నాం. జాగ్రత్తలో ఈ హాల్లో



sri sathyasai vachanamrutam

కూర్చుని మనం అన్నీ వింటున్నాం. స్వప్నావస్థలో యేదో ఒక దృశ్యాన్ని అనుభవిస్తున్నాం. ఈ దేహానికి ఆ స్వప్నమునము సంబంధం లేదనుకుంటున్నాం. సుషుప్తిలో ఆనందాన్ని అనుభవిస్తున్నాము. అప్పుడు ఈమనస్సు దేహము రెండూ లేదని అనుకుంటున్నాము. అయితే అనుభవించిన వాడెవరు? సుషుప్తిలో ఆనందాన్ని అనుభవించినవాడు తానే. స్వప్నములో ఈ పదార్థము యొక్క సంయోగాన్ని అనుభవించేది తానే. జాగ్రత్తలో ఈ సమావేశంలో కూర్చొని ఆనందంగా శ్రవణం చేసేదీ తానే. అయితే ఇక్కడ శ్రవణం చేసింది దేహతత్త్వంలో ఇంద్రియములు. స్వప్నములో పదార్థ సంయోగము ననుభవించినది సూక్ష్మదేహమైన మనస్సు. ఇంక సుషుప్తిలోపల అనుభవించిన తత్త్వము ఈ మనస్సుకు స్వాధీనము కాని ఒక అతీతమైన దివ్యత్వము. అవస్థలు మాత్రం వేరుకాని అనుభవించిన వ్యక్తి ఒక్కడే. కనుకనే భగవత్తత్త్వమనే దాన్ని అర్థం చేసుకోటం చాలాకష్టం. దానిపైన శ్రద్ధాభక్తులు ఉండినవారికే సులభమైన మార్గములో అనుభవించటానికి వీలౌతుంది.

ఒక్కొక్క సమయంలోపల ఇదే భగవత్ శక్తి అనేక రూపములు ధరించి ఉంటుంది. భక్తునియందు ఇది జ్ఞానాగ్నిగా రూపొందుతుంది. ప్రకాశిస్తుంది. భక్తుడు కానివాని హృదయమునందు ఇది క్రోధాగ్ని కామాగ్ని ద్వేషాగ్నిగా రూపొందుతుంది. అగ్ని అనేది చాలా భయంకరమైనది. అది దూరంగా ఉండినప్పుడే మనకెంతో భయాన్ని కలిగిస్తుంది. భద్రతను లేకుండా చేస్తుంది. ఈనాటి మానవులు ఈ భయంకరమైన అగ్నిని హృదయమునందే పెట్టుకొని నిరంతరము భయభ్రాంతులకు గురౌతున్నారు. కామాగ్ని, క్రోధాగ్ని, ద్వేషాగ్ని, అసూయాగ్ని అనేవి చాలా బాధించేవి. దీనినే రావణకాష్ఠము అన్నారు. అన్ని అగ్నులు ఆరతాయిగాని ఈ అగ్నులు సులభంగా ఆరేవికావు. ఆరినట్లే కనుపిస్తాయి కాని తిరిగిఎప్పుడు ప్రజ్వలిస్తాయో చెప్పటానికి వీలుకాదు. ఈ అగ్నులు చల్లార్చటానికి ఏది మనకు ఆధారము? ఏది కావాలి? అదియే వైరాగ్యము, ప్రేమ అనే వర్షమును కురిపించాలి. ఈ ప్రేమ వర్షము ద్వారానే నిజమైన శాంతి మనకేర్పడుతుంది.

**శాంతితతో జీవించండి**

ఈనాడు మానవులకు అనేక విధములైన సౌకర్యములు, సదుపాయములు, సుఖములు

srisathyasaivahini.org

ఉండినప్పటికి నిరంతరము భయభ్రాంతికి గురైపోతున్నాడు. ఎన్ని విధములైన భద్రములు ఏర్పరచుకున్నప్పటికిని అతని భయంపోవటం లేదు. ఎన్ని సదుపాయములుండినప్పటికిని అతడు శాంతి అనుభవించటంలేదు. ఈ శాంతి లేకపోవటానికి కారణం ఏమిటి? ఈ భయంకలగటానికి కారణం ఏమిటి? వాని హృదయంలో ఈ కామక్రోధ, ద్వేషాగ్నులనేవి ప్రజ్వరిల్లు చుండటంచేత ఇంతటిభయము అశాంతిని అనుభవిస్తున్నాడు. శాంతిగా ఉండటానికి శాశ్వతమైన సదుపాయములు సర్వము ఉన్నాయి కదా! ఎందుకుశాంతి అనుభవించకూడదు? ప్రాకృతమైన సుఖశాంతులకు ఇదికాదు ఆధారము. పవిత్రమైన భావములే శాంతికి మూలకారణము. ద్వేషము లేనివాడు నిరంతరము శాంతిగానే ఉంటాడు. దోషము కల్గిన వానికే భయం ఆరంభమవుతుంది. భయమెప్పుడు ప్రవేశిస్తుందో అశాంతి సంభవిస్తుంది. దోషములు చెయ్యకుండా ఉండినప్పుడే ఒక విధమైన శాంతి కలుగుతుంది. దోషరహితుడు అయినప్పుడే నీవు భయభ్రాంతుడు కాకుండా ఉంటావు. దోషములు రాకుండా ఉండటానికి యేమి చెయ్యాలి? దేని ననుసరించాలి? ఏది దోషమో, ఏది మంచిదో అది నిర్ణయించుకునే శక్తి సామర్థ్యములు మానవునియందు లేవని భ్రమిస్తున్నారు. జగత్తునందున్న సమస్త ప్రాణికోటికంటె మానవునికి మాత్రమే ఇది దోషమా కాదా అని నిర్ణయించేశక్తి అధికంగా ఉంటుండాది. అట్లు తెలిసికూడను తాను దోషములోపల పడిపోతున్నాడు. దోషములని తెలిసికూడను దానినే అనుసరిస్తున్నాడు. కనుకనే అశాంతి భయము ఏర్పడుతుంటాయి. నిజంగా దోషమే తెలియకుండా ఉంటే దీనికి అశాంతిగాని భయముగాని ఉండటానికి వీలుకాదు. కొంతమంది పిచ్చివారుంటారు. Discrimination power లేకుండా ఉంటారు. వారు ఇది మంచి ఇది చెడ్డ అని నిర్ణయం చేయలేరు. ఏంచేసినప్పటికి అతనికి భయము ఉండదు. కారణమేమిటి? Discrimination power లేకపోవటం చేత వారు యేంచేసినా తప్పులేదు. భయంలేదు. ఈ discrimination విచారణాశక్తియే మానవునియందు ఉంటుందో వారికి మాత్రమే భయం, అశాంతి. ఈ విచారణాశక్తిని సన్మార్గములో ప్రవేశపెట్టాలి. నీ కాన్షన్సు నీ ఆత్మతృప్తిగా నిన్ను రైట్ అన్నప్పుడు దాన్ని అనుసరించాలి. కాన్షన్సు కాదన్నప్పటికిని నీవు అనుసరిస్తున్నావు. కనుకనే భయము, అశాంతి అనుభవిస్తున్నావు.

విద్యార్థులారా! అనేకమంది దోషములు చేయటానికికాని, అశాంతిని పొందటానికిగాని,

sri sathyasai vahini amrutam

భయము పొందటానికిగాని ఇదే మూలకారణము. ఈ భయము దూరము చేసుకోవాలనుకున్నప్పుడు సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం అంతా భగవంతునిదే. నాదేహము భగవంతునిదే సర్వము భగవంతునిదే అనే భావాన్నైనా మీరు విశ్వసించాలి. ఒక్కొక్క కట్టెలో అగ్ని ఉన్నట్లుగా దేహమూ ఒక కట్టెనే కనుక ఇందులో కూడను అగ్ని ఉంటుంది. ఈ అగ్నిని సరియైన రీతిలో మనం ఉపయోగపెట్టుకోవాలి. అగ్ని ఒక్కటే అయినప్పటికి ఒకటి చెడ్డ అగ్ని ఒకటి మంచిఅగ్నిగా ఉంటున్నాది. శ్మశానంలో ఒకదేహాన్ని కాలుస్తున్నారు అక్కడా అగ్నే. అగ్ని ఉంటుండాది అని దోశలు, ఇడ్లీలు మనం వేసుకుంటూ కూచుంటామా? ఆ అగ్నిని చెడ్డ అగ్నిగా భావిస్తున్నాం. అది శ్మశానాగ్ని. ఒక యజ్ఞం చేస్తున్నాము. అక్కడ కేశవాయస్వాహా చేస్తున్నారు. అది కూడను అగ్నియే. ఆ అగ్నిని దేవుని సమానంగా చూస్తున్నారు. అగ్నిదేవుడు అంటున్నారు. మనఇంటిలో వంట చేసుకుంటున్నాము. అదీ అగ్నే. కాని అది వంట చేసుకోటానికి మాత్రమే ఉపయోగపెడుతున్నాము. ఇంకొకరు సిగరెట్టు తాగుతున్నాడు అక్కడా అగ్నియే. కానీ ఆ అగ్నికి ఎవరైనా నమస్కరిస్తున్నారా? ఇంకొకడు ఊదివత్తులు ముట్టిస్తున్నాడు. అదీ అగ్నే. ఈ ఊదొత్తులు భగవంతునికి చుట్టి తాను నమస్కరిస్తున్నాడు అదే విధంగానే అగ్ని ఒక్కటైనప్పటికిని వినియోగవిధానములు వేరువేరుగా ఉన్నాయి. కానీ దైవత్వం ఒక్కటే. దివ్యత్వం ఒక్కటే. ఉపయోగించుకునే విధానాన్ని బట్టి ఈ మంచిచెడ్డలు రూపొందుతూ ఉన్నాయి.

## సచ్చిదానందము

భగవంతుడు అస్తి, భాతి, ప్రియం, రూపము, నామము అని ఐదు గుణములతో ఉంటున్నారు. దీనినే సంస్కృతములో సత్ చిత్ ఆనందము రూపము నామము అన్నారు. రూపాలు, నామాలు మాత్రమే మనకు గోచరిస్తున్నాయి. కాని అస్తి భాతి ప్రియం సత్ చిత్ ఆనందము అనేది తెలియటంలేదు. ప్రతిపదార్థమునందు కూడను సత్‌చిత్ ఆనందము ఉంటుండాది. ఈ టేబిల్‌లో కూడ సత్‌చిత్ ఆనందము ఉంది. ఈ మైక్‌లోపలకూడా సత్‌చిత్ ఆనందము ఉంది. ఐతే సత్‌చిత్ కనుపిస్తుండాది. కానీ ఆనందము మనకు గోచరం కావటంలేదు. సత్ అనగా ఇది ఉంది. మైక్ ఉంది. ఇది కనిపిస్తుండాది. చిత్ వినిపిస్తుండాది. ఇవి రెండూ సత్యమే. కాని అది ఆనందిస్తుండాదా లేదా అనేది మాత్రం మనకు గోచరం కావటంలేదు.

sri sathyasai vacharamrutam

వీనిని మనం జడములు అంటున్నాం.

ఇప్పుడు నరసింహన్ ఉంటున్నాడిక్కడ. ఆయనకు సత్‌చిత్ దేహము నామము రెండు ఉంటున్నాయి. కానీ అతడి ఆనందము కూడను మనకు గోచరిస్తుండాది. స్వామి యొక్క ఉపన్యాసము విని ఆనందిస్తున్నాడు. కనుకనే మానవునియందు మాత్రమే ఆనందము గోచరమౌతుంది. ఇంక అన్నింటియందు సత్‌చిత్ ఉంది గాని ఆనందం గోచరం కావటం లేదు. ప్రతి పదార్థమునందు భగవత్స్వరూపమే ఉంటుండాది. ఈ పదార్థమును పరార్థముగా మార్చటమే సాధనయొక్క లక్ష్యం. ఈ డివినిటీ అనేదాన్ని ప్రేమతత్త్వంగా మనం భావించాలి. ప్రేమ లేకపోతే దివ్యత్వమనేది ఏమాత్రము మనకర్థం కాదు. మనము అన్నింటిని క్రొత్తగా క్రొత్తగా చూసుకుంటూపోతే మనకు ఏమాత్రం అధికారం లభ్యముకాదు. మనము అధికారం లభ్యము కావాలనుకున్నప్పుడు ఒక హక్కును కూడను సంపాదించాలి. ఈ వాక్కును సంపాదించుకున్నప్పుడే మనం అతణ్ణి మన సొంతరీతిగా వినియోగించుకుంటాం.

ఒక చిన్న ఉదాహరణము. ఒక కొత్త మిత్రుడే వచ్చినాడంటే లేక ఒక బంధువే వచ్చినాడంటే కుర్చీవేసి, అన్నీ వేసి రండి దయచేయండి కూర్చోండి అని కాఫీ టిఫిన్ ఇచ్చి మర్యాదగా అన్ని విధములుగా గౌరవిస్తాడు. ఈ గౌరవమర్యాదలు పొందేవాడు ఎవడు? క్రొత్తవాడే. క్రొత్తవానికి మాత్రమే ఈ respect అంతా. పాత మిత్రుడైతే రారా పోరా అని కూర్చుంటావు. వానితో ఇష్టము వచ్చినట్లు మాట్లాడుతావు. చేయి బట్టి లాక్కొని వస్తావు. అక్కడ కీర్తిమర్యాదలు లేవు కాని అధికారమెక్కువగా ఉంది. ఈ అధికారం చేతనే ప్రేమ కూడను స్వేచ్ఛగా ఉంటుంటాది. కనుకనే స్వేచ్ఛ ఉండినప్పుడే మనకు ప్రేమ కూడా వస్తుంది. స్వేచ్ఛ లేనంత వరకు ప్రేమ రావటానికి వీలులేదు. స్వేచ్ఛ కావాలంటే ఏమిచెయ్యాలి. అర్పితము కావాలి. నా నీ అనేరెండూ రాకూడదు. నేను నేను నేను అనేది ఏనాడు మాయమై పోతుందో అదే వేదాంతమన్నారు. నేను అనేది లేకుండా పోవాలి. ఈ నేను అనేది కాకుండా అంతా నీవే అనేస్థితికి రావాలి. ఎందుకంటే జగత్తంతా ఉన్నది నీవే. కనిపించినా కనిపించకపోయినా నీవే.

కరెంటు అన్నివైపులా ఉంటుండాది. స్విచ్‌ఆఫ్ చేసినప్పుడు కనిపించదు. కనిపించకుండా పోయినంతమాత్రమున లేదని చెప్పటానికి వీలుకాదు. స్విచ్ ఆన్‌చేస్తే కనిపిస్తుంది. కనుక

srisathyasaivachanamrutam

స్విచ్ ఆన్ చెయ్యటము ఆఫ్ చెయ్యటము నీలో ఉన్న ప్రయత్న దోషమే గానీ భగవంతుడు సర్వత్రా ఉంటున్నాడు. అజ్ఞాన వశము చేత నీవు దీనిని స్విచ్ ఆన్ చెయ్యలేకుండా లైటు లేదు లైటు లేదు అని చెప్పిభ్రమిస్తున్నావు. ఏదైనా ఒక దోషము ఉండాలి. లేక ఈలైటు రాకుండా ఉండటానికి మరొక కారణము ఉంటుండాలి. వీనికన్నిటికి కూడను మెయిన్‌స్విచ్ వేరే ఉంటుండాది. ఈ మెయిన్‌స్విచ్ ఆఫ్ చేసి రూము రూముల్లోనా లైట్లు వేస్తే లైట్లు రావు. ఆ మెయిన్ స్విచ్ అనేది ఏమిటి? అదే దివ్యమైన ప్రేమ. ప్రేమ అనే స్విచ్ వేస్తే అన్ని అంగములయందుకూడను ప్రేమ ప్రారంభమౌతుంది. మాటల్లో ప్రేమ మాటలొస్తాయి. చేతల్లో ప్రేమ పనులు చేస్తావు. హృదయములో ప్రేమభావములు అభివృద్ధి అవుతాయి. కన్నుల్లో ప్రేమ దృష్టి వస్తుంది. చెవుల్లో ప్రేమ విషయాలు శ్రవణం చేస్తావు. అన్ని అంగములయందు ప్రేమ అనే ప్రకాశమే వెలువడుతుంది. ఆ ప్రేమ లేకుండా కేవలము స్వార్థము స్వప్రయోజనము నిమిత్తమై మనము ప్రాకులాడినప్పుడు అన్ని అంగములు అంధకారమును పొందుతాయి. కనుకనే ప్రేమయే ప్రధానమైనది. మన హృదయంలో ప్రేమను పెంచాలి. మన అంగములో ప్రేమను వికసింపచెయ్యాలి. ప్రేమ జీవితాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి. ప్రేమతోనే ప్రేమను చేర్చుకోవాలి. కనుకనే గోపికలందరు కృష్ణుని అదే కోరారుట.

**ప్రేమరహిత మరు భూములలో ప్రేమాంకురములు పెంపొంద**
**ప్రేమావేశములో ప్రేమ సుధావర్షము వర్షింపగ**
**ప్రేమనదులు ప్రవహింపగ మురళీ**
**గానముసేయగదే కృష్ణా గానము సేయగదే.**

ప్రేమరహిత మరుభూములివన్నీ. ఎండబారిన బండభూములివన్నీ. ఒక విధమైన బీడు భూములు. ప్రేమ అనే బీజములే దీన్లోనా నాటేది. నీగానము ఎట్ల ఉండాలంటే అంత ప్రేమమయంగా ఉండాలి. ఈ ప్రేమ ఎప్పుడొస్తుంది? ఆనంద సమయములోనే ఈ ప్రేమ వస్తుంది.

### ప్రేమ ఉన్నచోటే ఆనందము

ప్రేమ ఉండినప్పుడే ఆనందము వస్తుంది. ఆనందంగా ఉండినప్పుడే గానం పాడతావు.

sri sathyasai vahini amrutam

## తేది. 28-06-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

మీరు నిత్య జీవితంలో చక్కగా గుర్తుంచుకోండి. నీవు చక్కగా ఆనందముగా ఉన్నావంటే ననగా ననగా ఏదో పాటలు పాడుకుంటూ ఉంటావు. ఆ ఆనందములోనే నీకు సంగీతమొస్తుంది. కాని దుఃఖములో సంగీతము రాదు. బాత్‌రూమ్‌లోనైనా నీవు పాడుకుంటూ ఉంటావు. ఎక్కడైనా సరే ఈ ఆనందమనేది ఎప్పుడొస్తుంది? ఆనందసమయములోనే సంగీతం ప్రారంభమవుతుంది. రుద్రభూమి, భద్రభూమి రెండింటియందుకూడను గానం చేసినవాడు కృష్ణుడు. యుద్ధభూమిలోకూడను గానం చేశాడు. అందుకోసమే భగవద్గీత అన్నారు. ఈ battlefield లోపల నీకు మాత్రం భయం ఉండవచ్చును. ఏమవుతుందో ఎవరు చంపుతారో అనే భయము ఉండవచ్చు. కానీ కృష్ణునికి భయంలేదు. భగవంతునికి నో భయం. నో ఫియర్. కనుకనే చెప్పాడు. Be fearless I am withyou అన్నాడు. భగవంతుడు వెంట ఉన్నప్పుడు ఇంక ఫియర్‌కు అవకాశమే లేదు. నీవే భగవంతుడైనప్పుడు ఇంక ఫియర్ ఎందుకు రావాలి? భగవంతుడు లేని హృదయంలేదు కదా! ఆ భావముతో నీవు fearless గా ఉండు. ఇదే ఈనాడు మనం సంపాదించుకోవలసిన ఆనందము. ఇదే ఈనాడు మనం పోషించుకోవలసిన ఆనందం. ఇదే ఈనాడు మనం నిల్పుకోవలసిన ఆనందం. ఇది లేకపోతే ఏమీ joy ఉండదింక. Icecream joy మాత్రం ఉంటుంది. కనుక ఈ విధమైన ఆనందాన్ని అనుభవించే నిమిత్తమై భగవత్ప్రేమను పొందాలి. ఈ ప్రేమప్రేమ చేతనే తప్ప అన్యమార్గములో మనకు లభ్యంకాదు. విద్యార్థులారా! నిజంగా మానవుని జీవితము చాలా అదృష్టవంతమైన జీవితం. పవిత్రమైన జీవితము. జీవించవలసిన జీవితము గౌరవించవలసిన జీవితము. అలాంటి మానవ జీవితాన్ని ఈనాడు మనము మాణిక్యమును మసి బొగ్గులకు అమ్ముకున్నట్లుగా విషయ వాసనలంతా అమ్ముకొని వ్యర్థం గావించుకుంటున్నాము.

**(తేది. 28-06-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam